తెలంగాణ ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక





హైదరాబాద్ | శుక్రవారం | 10 - 07 - 2026 | ఎడిటర్ : యాదగిరి అవిశెట్టి | పేజీలు : 4


# ప్రతిపక్షాలకు అభివృద్ధి కనిపించడం లేదా..?

## కాంగ్రెస్ మోత్కూరు మండల అధ్యక్షుడు రాచకొండ బాలరాజుగౌడ్

- నియోజకవర్గం, మండలం అభివద్ధికి నిరంతరం ఎమ్మెల్యే కృషి
- మోత్కూరు మండలంలో 379 ఇందిరమ్మ ఇండ్లు, 6 వేల కొత్త రేషన్‌కార్డులు
- మున్సిపాలిటీలో డబుల్ బీటీ రోడ్డు నిర్మాణం
- ఎమ్మెల్యే సామేల్‌పై అనవసర విమర్శలు చేస్తే సహించేది లేదు



**ప్రజావారధి/మోత్కూరు**

తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ నాయకత్వంలో మోత్కూరు మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు కనిపించడం లేదా అని కాంగ్రెస్ మోత్కూరు మండల అధ్యక్షుడు రాచకొండ బాలరాజుగౌడ్ ప్రశ్నించారు. మోత్కూరు మున్సిపల్ కేంద్రం లోని గెస్ట్ హౌస్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యే సామేల్ రెండేళ్ల కాలంలోనే ఎన్నో అభివృద్ధి పనులు జరిగాయని, మున్సిపల్ కేంద్రంలో అధ్వానంగా ఉన్న రోడ్డును డబుల్ బీటీ చేశారని, రూ.5 కోట్లతో చేసిన అభివృద్ధిని చూసే మున్సిపాలిటీలో ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టారన్నారు. మున్సిపాలిటీలో కబ్జాకు గురైన 4 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడి దానికి ఫెన్సింగ్ వేయించారని, ప్రభుత్వ జూనియర్ కాలేజీ స్థలాన్ని కూడా కొందరు కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తుండగా దానిని కూడా రక్షించి చుట్టూ ఫెన్సింగ్ మంజూరు చేయించారని తెలిపారు. బృందావన్ కాల్వ ప్రక్షాళన కోసం రూ.1.50 కోట్ల నిధులు మంజూరు చేయించారని చెప్పారు. గత ప్రభుత్వంలో పేదోళ్లకు ఒక్క ఇల్లు కట్టించ లేదని, కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎమ్మెల్యే సామేల్ మండలంలోని పది గ్రామాల్లో 167, మున్సిపాలిటీలో 166 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయించారని, పైలెట్ ప్రాజెక్ట్ కింద పాటిమట్ల గ్రామంలో 46 ఇండ్లు మంజూరు చేయగా మండలంలో మొత్తం 379 ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం జరుగుతుందని, ఎమ్మెల్యే సామేల్ సహకారంతో పేదల సొంతింటి కల నెరవేరుతుందన్నారు. ఎన్నో ఏళ్లుగా రేషన్‌కార్డుల కోసం ఎదురు చూస్తున్న ప్రజలకు సుమారు 6 వేల రేషన్‌కార్డులు మంజూరు చేయించారని తెలిఇపారు. మండలంలో 2556 కుటుంబాలకు గృహజ్యోతి కింద ఉచిత విద్యుత్ ద్వారా ప్రతినెలా రూ.8 లక్షల బిల్లులను ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. రైతుల సంక్షేమం కోసం రైతు భరోసా పథకంలో రూ.9 వేల కోట్లు రైతుల ఖాతాల్లో వేసింది ప్రతిపక్షాలకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఈ ప్రాంత బిడ్డగా ఎమ్మెల్యే సామేల్ నిత్యం ప్రజల మధ్య ఉండి పని చేస్తున్నారని, గత ప్రభుత్వంలో పదేండ్లు ఎమ్మెల్యేగా పనిచేసిన మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ నియోజకవర్గ అభివృద్ధిని ఏ మాత్రం పట్టించు కోలేదన్నారు. మోత్కూరుకు కోర్టు కూడా మంజూరైందని, త్వరలోనే ఏర్పాటు కానుందన్నారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, బిక్కేరు బ్రిడ్జిపై హైలెవల్ బ్రిడ్జి మంజూరు, ప్రభుత్వ ఆస్పత్రి అప్‌గ్రేడ్ మంజూరు కోసం కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రతిపక్షంగా నిర్మాణాత్మకమైన సూచనలు, సలహాలు ఇస్తే బాగుంటుందని, అనవసరంగా ఎమ్మెల్యే సామేల్‌పై విమర్శలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. వచ్చే ఎన్నికల్లో కూడా ఎమ్మెల్యేగా సామేల్ పోటీ చేస్తారని, ప్రజలు భారీ మెజార్టీతో గెలిపించడం ఖాయమన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షునిగా తన నియామకం కోసం కృషి చేసిన ఎమ్మెల్యే సామేల్, ఎంపీ కిరణ్ కుమార్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు అయిలయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ గడ్డం స్వప్నసోమనర్సయ్య, సింగిల్‌విండో చైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లు, మార్కెట్ డైరెక్టర్ పన్నాల శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకులు డాక్టర్ జి.లక్ష్మీ నర్సింహారెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా మాజీ కార్యదర్శి మందుల సురేష్, మహిళా కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షురాళ్లు ముద్దం జయశ్రీ, అన్నెపు పద్మ, మాజీ సర్పంచులు చేతరాశి అంజయ్య, చింతల విజయభాస్కర్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ ఎడ్ల భగవంత్, పల్లె భిక్షం, పల్లపు సమ్మయ్య, సుంకిశాల అనిల్, మెంట యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# వృత్తి విద్య పూర్తి చేసిన విద్యార్థులకు జాబ్ మేళా

**ప్రజావారధి/మోత్కూరు**

వృత్తి విద్య కోర్సులో ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులకు ఈనెల 14న ఉమ్మడి జిల్లా కేంద్రంలోని కెపిఎం వృత్తి విద్య కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నారని మోత్కూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.రవీందర్ తెలిపారు. జాబ్ మేళాకు సంబంధించిన ఫ్లెక్సీని కళాశాలలో శుక్రవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఈ జాబ్ మేళాలో 2024 నుండి ఇంటర్ వృత్తి విద్య కోర్సుల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని, 162 కంపెనీలు ఈ జాబ్ మేళాలో పాల్గొంటాయని, ఎంపికైన వారికి ఉద్యోగ శిక్షణతో పాటు ఉద్యోగావకాశాలు కల్పించనున్నాయని చెప్పారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో లెక్చరర్లు, సిబ్బంది పాల్గొన్నారు.




# బీసీ బాలికల హాస్టల్‌ను తనిఖీ చేసిన స్పెషల్ ఆఫీసర్



**ప్రజావారధి/మోత్కూరు**

మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని బీసీ బాలికల హాస్టల్‌ను గురువారం రాత్రి జిల్లా ఉపాధి కల్పన అధికారి, ప్రత్యేక అధికారి ఎన్.పద్మ ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్‌లో అన్నీ సమస్యలే ఉన్నాయని, శానిటేషన్ సరిగా లేదని, ఫ్యాన్లు పని చేయడం, లైటింగ్ సరిగా లేదన్నారు. స్టోర్ రూంకు తాళం వేసి ఉండటంతో పాటు రిజిస్టర్లు అందుబాటులో లేకపోవడంతో ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. గత నెల 30న నిర్వహించిన తనిఖీల్లో, ప్రస్తుతం వార్డెన్ హాస్టల్‌లో లేరన్నారు. విద్యార్థులకు వసతులు కల్పించడం, విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన బాధ్యులపై తగిన చర్యల కోసం కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. హాస్టల్‌లో వెంటనే విద్యార్థులకు అవసరమైన వసతులు కల్పించాలని ఆదేశించారు.



# చేనేత సమస్యలను పరిష్కరించాలి

## స్టేట్ కమిషనర్‌ను కలిసిన చేనేత నాయకులు

ప్రజావారధి/మోత్కూరు

చేనేత పరిశ్రమ, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర అధ్యక్షుడు వనం శాంతికుమార్ కోరారు. చేనేత, జౌళిశాఖ స్టేట్ నూతన కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన సభ్యసాచిఘోష్‌ను గురువారం హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో వారు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు చెప్పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేనేత సంఘాల క్యాష్ క్రెడిట్ రుణాలు మాఫీ చేయాలని, చేనేత కార్మికులకు ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో తీసుకొచ్చిన జీవో నం.1 ద్వారా సహకార సంఘాల్లో ఉత్పత్తి చేసిన బట్టలను టెస్కో ద్వారా కొనుగోలు చేసి గురుకులాల విద్యార్థులకు సరఫరా చేయాలని, టెండర్లు లేకుండా టెస్కో ద్వారానే కొనుగోలు చేయాలని కోరారు. త్రిఫ్ట్ పథకంలో కార్మికులకు, అనుబంధ కార్మికులకు ప్రభుత్వం జమ చేయాల్సిన నిధులను జమ చేయడం లేదని, వెంటనే ఆ బకాయిలు విడుదల చేయాలని, నేతన్న భరోసా పథకంలో కార్మికులకు రూ.4500, అనుబంధ కార్మికులకు రూ.1500లను మూడు నెలలు మాత్రమే జమ చేసిందని, మిగతా బకాయి నిధులను కూడా వెంటనే జమ చేసి ఇవ్వాలన్నారు. జియో ట్యాగింగ్ చేసిన కార్మికులకు త్రిఫ్ట్ పథకం అమలు చేయాలని, పెరిగిన ధరలకనుగుణంగా రేట్లు పెంచాలని, షరతులు లేకుండా నేతన్న బీమా అమలు చేయాలని, చేనేత రిజర్వేషన్ చట్టం అమలు చేయాలని, ఇందిరమ్మ ఇండ్ల పథకంలో కార్మికులకు వర్క్ కం షెడ్లు నిర్మించాలని, వడ్డీ లేకుండా బ్యాంకుల ద్వారా రూ.5 లక్షల వరకు రుణాలు ఇప్పించాలని కోరారు. సమస్యలన్నింటిపై చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారని తెలిపారు. రాష్ట్ర కార్యదర్శి ముశం నరహరి వారి వెంట ఉన్నారు.

# ఆరాధ్య ఫౌండేషన్ చైర్మన్ వాణిశ్రీకాంత్ రాజ్ జన్మదిన వేడుకలు

ప్రజావారధి/మోత్కూరు




ఆరాధ్య ఫౌండేషన్ చైర్మన్ డా.తాడోజు వాణిశ్రీకాంత్‌రాజ్ జన్మదిన వేడుకలను గురువారం మున్సిపల్ కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఫౌండేషన్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బర్త్ డే కేక్‌ను కట్ చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు గనగాని నర్సింహ మాట్లాడుతూ ఆరాధ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు వందలాది కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించిన వాణిశ్రీకాంత్ రాజ్ మరెన్నో పుట్టినరోజు వేడుకలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులు వెల్మినెటి జహంగీర్, కల్వల నరేశ్, జిల్లా గౌరవాధ్యక్షుడు దబ్బెటి సోంబాబు, గిరగాని వీరేందర్, సూర్యాపేట జిల్లా నాయకులు గుగులోతు జైపాల్ నాయక్, యూత్ అధ్యక్షుడు పోచం ఉపేందర్, సీనియర్ నాయకులు పురుగుల యాదగిరి, శ్రీను, మొరిగాల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక

## మోత్కూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని
# 30 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయాలి





- ఖాళీగా ఉన్న డాక్టర్ పోస్టులను భర్తీ చేయాలి
- పోస్టుమార్టం సదుపాయం కల్పించాలి
- ఆస్పత్రిని విజిట్ చేసిన సీపీఎం నాయకులు

ప్రజావారధి/మోత్కూరు

మోత్కూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొల్లు యాదగిరి, మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు కోరారు. సీపీఎం ఆధ్వర్యంలో గురువారం ఆస్పత్రిని విజిట్ చేసి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆస్పత్రి భవనం నిర్మించి సుమారు 60 ఏళ్లవుతుండటంతో శిథిలమైందని, వెంటనే కొత్త భవనం నిర్మించాలన్నారు. మూడు డాక్టర్ పోస్టులకు గాను ఒక్కరు మాత్రమే ఉన్నారని, ఖాళీగా ఉన్న డాక్టర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, పీహెచ్‌వో పోస్టు ఖాళీగా ఉందని, పాడిచేడు, దత్తప్పగూడెం ఏఎన్ఎం పోస్టులు కూడా ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేయిస్తానని ఎమ్మెల్యే సామేల్ ఎన్నికల్లో హామీ ఇచ్చారని, మూడేళ్లు కావస్తున్నా ఎమ్మెల్యే ఇచ్చిన హామీ నెరవేరడం లేదన్నారు. ఆస్పత్రికి ప్రతిరోజు వంద మందికి పైగా రోగులు వస్తున్నారని, కనీస వసతులు తాగునీరు, మరుగుదొడ్లు లేవన్నారు. ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేయడంతో పాటు పోస్టుమార్టం సదుపాయం కల్పించాలని, తాగునీటి కోసం వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి రాచకొండ రాములమ్మ, మండల కమిటీ సభ్యులు దడిపల్లి ప్రభాకర్, పానుగుల రమేష్, గుండు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.